
సాక్షి
బాపట్ల
సోమవారం। 16। అక్టోబర్। 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3,800 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 773 క్యూసెక్కులు విడుదల చేశారు.



పార్వతీమాతకు గాజులు సమర్పణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ దేవత దండిపార్వతీ అమ్మవారికి ఆదివారం అమరావతికి చెందిన శిష్టా లక్ష్మీ గణేష్ రెండు బంగారు గాజులను సమర్పించారు.

జాతీయస్థాయి పోలీస్ టెన్నిస్ పోటీలకు ఏఆర్ ఏఎస్పీ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు జాతీయ స్థాయిలో జరగనున్న పోలీస్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17 నుంచి గుజరాత్ అహ్మదాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోలీస్ టెన్నిస్ పోటీల్లో ఆయన పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన ఐజీ



టీజేపీఎస్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 7,145 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లను జారీ చేసిన విషయం తెలిసిందే. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ కలిసి ఏసీ కళాశాల, టీజేపీఎస్ కళాశాల, విజ్ఞాన్ నిరులా/డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. నిర్ణీత వేళలో అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మౌలిక వసతులు కల్పించారు. కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎస్‌ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఏఎస్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి (పశ్చిమ), బాలసుందరరావు (ట్రాఫిక్) పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

నేడు పల్నాడు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా, నవోదయం

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు ఆదివారం వెల్లడించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హెటిరో డ్రగ్స్, యూనిటరీ మోటార్ సర్వీసెస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు వంటి కంపెనీలు హాజరవుతాయని వివరించారు. విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ చదివిన 18 ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని వెల్లడించారు. వారు విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని సంజీవరావు పేర్కొన్నారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు


గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 17న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ కోసం కళాశాల ప్రాంగణంలో జవహర్ విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలకు బీటెక్, ఎంబీఏ మినహా పీజీ పూర్తి చేసిన 26 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక ఎన్జీఓ భవనంలో జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 45 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన జట్లను ఈనెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరగనున్న 8వ అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎడమకాలువకు 5,874, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 848.80 అడుగుల వద్ద ఉంది.

జయహో జగన్మాత

కొండంత వైభవం.. 'శరన్నవ' సంబరం

- వైభవంగా ఆరంభమైన దసరా ఉత్సవాలు
- బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ
- అమ్మవారికి గవర్నర్ నజీర్ దంపతుల ప్రత్యేక పూజలు
- తొలి దర్శనం చేసుకున్న సీపీ, చైర్మన్, ఈవో
- మొదటి రోజే రికార్డు స్థాయిలో భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తి కెరటం ఎగిసిపడింది. జగన్మాత బాలాత్రిపుర సుందరీదేవిగా సాక్షాత్కరించిన వేళ.. భక్తి కోటి శరణు ఘోషతో కొండంతా మార్మోగింది. అల కైలాసం ఇల దిగి వచ్చిందా అన్నంతగా విజయవాడ నలుదిశలా నవరాత్రుల శోభ పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.





హారతి కనుమా.. కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా మహోత్సవాలలో తొలి రోజైన ఆదివారం దుర్గమ్మను శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అశేష భక్తజనం దర్శించుకుని తరించారు. దసరా ఉత్సవాల చరిత్రలోనే తొలి రోజున రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 80 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రే నగరానికి చేరుకున్న భక్తులు తెల్లవారుజామునకే క్యూలైన్‌లోకి చేరారు. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులను వీఎంసీ కంపార్టుమెంట్‌లోకి తరలించారు. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కాగా, సాయంత్రం 6.30 గంటల వరకు ఏకరీతిన రద్దీ కొనసాగింది. సర్వ దర్శనం క్యూలైన్లతో పాటు రూ.100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లో అడుగడునా మంచినీటి ప్యాకెట్లు, చిన్నారులకు పాలు పంపిణీ చేశారు.


మేళతాళాలతో ఊరేగింపు..

దసరా ఉత్సవాల నేపథ్యంలో తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.40 గంటలకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సీపీ టి.కె. రాణా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది అమ్మవారిని తొలి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఇత్తడితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తరలించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేక లక్ష కుంకుమార్చనను ప్రారంభించారు. ప్రత్యేక కుంకుమార్చనలో చైర్మన్ దంపతులతో పాటు ఈవో దంపతులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధ్యత మరవొద్దు: మంత్రి కొట్టు



అధికారులందరూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పని చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లను మంత్రి ఆదివారం పరిశీలించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద క్యూలైన్లను పరిశీలించి, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. అమ్మవారి దర్శనం చేసుకుని ఘాట్ రోడ్డు వైపు వస్తున్న భక్తులను ఆరా తీశారు. ఇంత మంది భక్తులు ఘాట్‌రోడ్డు వైపుగా ఎందుకు వస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిఫార్సులు, డ్యూటీ కార్డులపై దర్శనాలకు వచ్చే వారిని నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరి ఉండటంతో పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్లు ఎక్కడా ఆగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించారు. రూ. 500 టికెట్ క్యూలైన్‌లో కొన్ని లోపాలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించి భక్తుల ఇబ్బందులను తొలగించామన్నారు.



చూసిన కనులదే భాగ్యము.. పల్లకీపై ఊరేగుతున్న ఉత్సవమూర్తి

నగరోత్సవం.. నేత్రపర్వం

దసరా మహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం కనుల పండువగా జరిగింది. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవంలో తొలుత ఆది దంపతులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో కేఎస్ రామారావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహామండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గోశాల, కనకదుర్గనగర్, దుర్గాఘాట్, ఘాట్ రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య సాగిన ఊరేగింపులో భక్తులు, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన..

ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, ఎస్పీ రవీంద్రబాబు, డీసీపీ విశాల్ గున్ని, వెంకటరత్నం, అజిత, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు. ఈవో కేఎస్ రామారావులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఓ దశలో పెద్ద ఎత్తున భక్తులు ఐడీ కార్డులు ధరించి అమ్మవారిని దర్శించుకోవడంతో పోలీసులు విస్మయానికి గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకునే వారి ఐడీకార్డులను రెవెన్యూ, పోలీసు సిబ్బంది కార్డులను తనిఖీ చేశారు. వాటిపై పేరు, ఇతర వివరాలు లేకపోవడంతో పాటు కనీసం ఫొటో కూడా లేకపోవడంతో వారి నుంచి కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి దర్శనం
- తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు, ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచహారతుల సేవ, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం



అతిథులకు ఆహ్వానం.. దుర్గమ్మ సన్నిధిలో గవర్నర్ దంపతులు



ధూంధాం సంబరం.. కేరళ సంప్రదాయ దప్పు కళాకారుల విన్యాసం



సాంస్కృతిక సౌరభం.. కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణి



భక్తఝరి.. విజయవాడ వినాయక గుడి వద్ద భక్తుల రద్దీ

జల భరోసా

- కృష్ణా డెల్టాకు ఇబ్బంది లేనట్టే..
- రైతులు ఆందోళన చెందొద్దు
- చివరి ఎకరాకూ నీరు
- పులిచింతల, పట్టిసీమ నుంచి తరలింపు
- కార్యాచరణ సిద్ధం చేస్తున్న జలవనరుల శాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పులిచింతలలో ప్రస్తుత నీటిమట్టం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కృష్ణా, పశ్చిమ డెల్టాలో ఒక్క ఎకరా కూడా ఎండకుండా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గత వారంలో కొంత నీటి సరఫరా తగ్గడంతో అక్కడక్కడ రైతులు ఆందోళన చెందుతున్న సంగతి తెలిసిందే. దీనిపై పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్న అధికారులు పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. చివరి ఎకరాకూ నీరు అందించేలా చర్యలు చేపట్టారు. అవసరమైన చోట వారాబందీ ఏర్పాటు చేసి కాలువ చివరి భూముల వరకూ నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫలితంగా కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ వర్షపాతం వల్లే..

ఈ సీజన్‌లో రెండు నెలల్లో వర్షపాతం చాలా తక్కువగా ఉండటం, కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ వర్షాలు తక్కువగా నమోదు కావడం వల్ల కృష్ణానది జలాశయాలు ఆశించినంతగా నిండలేదు. ఫలితంగా కొంతమేర నీటి సమస్య ఎదురైంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టు ద్వారా ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. కృష్ణా డెల్టా విషయానికి వస్తే ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. గత నెల ఏడో తేదీన జరిగిన నీటిపారుదల, వ్యవసాయ సలహామండళ్ల సంయుక్త సమావేశంలో ఆ తేదీ నాటికి వేసిన పంటలకు నీరు ఇస్తామని, తర్వాత వేసేవారు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించిన సంగతి తెలిసిందే.

పెరిగిన పులిచింతల నీటిమట్టం

గతనెల ఏడో తేదీన పులిచింతలలో 21 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అయితే సెప్టెంబర్‌లో పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం పులిచింతలలో 32 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు పట్టిసీమ నుంచి కూడా 20 పంపుల ద్వారా రోజూ ప్రకాశం బ్యారేజీకి ఐదువేల క్యూసెక్కులు ఇస్తున్నారు. శనివారం కూడా ప్రకాశం బ్యారేజి నుంచి 8,500 క్యూసెక్కులు తూర్పు, పశ్చిమ డెల్టాలకు విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కులు విడుదల చేశారు.

మరో 15 రోజుల వరకు పట్టిసీమ నుంచి నీరు

తూర్పు డెల్టాలో పంటలు ముందుగా వేయడం, పంట పొట్ట దశకు చేరుకోవడంతో నీటి అవసరం ఎక్కువగా ఉంది. పశ్చిమ డెల్టాలో ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుకుంటోంది. ఇప్పటి నుంచి మరో పదిరోజుల పాటు సరిపడా నీటి సరఫరా ఉంటే రైతులు గట్టెక్కుతారు. దీంతో పట్టిసీమ నీటితో పాటు పులిచింతల నుంచి కూడా రోజూ ఐదు వేల క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు. మరో పదిహేను రోజుల వరకూ పట్టిసీమ నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో డెల్టాలో పంటలను కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. పట్టిసీమ నుంచి 7,080 క్యూసెక్కులు విడుదల చేస్తుంటే ఇక్కడికి ఐదు వేలపైచిలుకు మాత్రమే వస్తోంది. మధ్యలో పంటల కోసం మోటార్లు పెట్టడం కూడా సమస్యగా మారింది. దీనిపై తనిఖీల కోసం జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

తాగునీటి అవసరాలకూ వినియోగం

గుంటూరు కార్పొరేషన్, తెనాలి, బాపట్ల, చీరాల పట్టణాల తాగునీటి అవసరాలకూ ప్రకాశం బ్యారేజ్ నుంచి విడులయ్యే నీరే ఆధారం. దీనివల్ల కొంత నీటి ఎద్దడి కనిపిస్తోంది. 4,500 క్యూసెక్కులు విడుదల చేసిన సమయంలో సమస్య రావడం లేదు. అంతకంటే తక్కువ నీటిని విడుదల చేస్తే మాత్రం శివారు పొలాలకు సాగునీరు అందట్లేదు. ఈ సమయంలో వారాబందీ ఏర్పాటు చేసి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అధికారులు సమాచారం అందిస్తున్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కూడా ఎప్పటికప్పుడు ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో పరిస్థితిపై సమీక్ష జరుపుతున్నారు.

మూడునెలలుగా వర్షపాతం ఇలా.. (మిల్లీమీటర్లు)

నెల	సాధారణం	కురిసింది
ఆగస్టు	164.7	102.7
సెప్టెంబర్	145.2	202.3
అక్టోబర్	129.4	14.5 (ఇప్పటివరకు)

కృష్ణాపశ్చిమ డెల్టాలో సాగు ఇలా(ఎకరాల్లో)..

మొత్తం ఆయకట్టు	ప్రస్తుతం ఖరీఫ్ సాగు
5,71,351	4,63,000

ఇబ్బంది లేకుండా చర్యలు

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎక్కడా పంటలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఎక్కడ నీటి ఎద్దడి ఉందని సమాచారం వచ్చినా వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నాం. వారు కూడా స్పందిస్తున్నారు. డెల్టాలో పంటకు అవసరమైన నీరు అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ ఎస్‌ఈ

జగజ్జననీ నమో



బాలాత్రిపురసుందరిదేవిగా కటాక్షిస్తున్న భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాతసేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యం, నవావరణ పూజలు జరిగాయి. అర్చకస్వాములు ఉభయదాతలచే పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు భ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చనలు, 6 గంటలకు హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయానికి అధికసంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. సోమవారం భ్రమరాంబ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమివ్వనున్నారు.

ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయి

- ఉప్పాల అమర్నాథ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంది.. వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది
- రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కామినేని కోటేశ్వరరావు

చెరుకుపల్లి: ఇటీవల హత్యకు గురైన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ అన్నివిధాల ఆదుకుందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ మండల పరిధిలోని ఉప్పాలవారి పాలెం గ్రామానికి చెందిన విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ హత్యకు గురైన విషయం తెలిసిందే, అయితే నాడు హత్య జరిగిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వ పరంగా నిందితులను అరెస్టు చేయటం జరిగిందన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రాష్ట్ర మంత్రి జోగి రమేష్, పార్టీ గౌడ పెద్దలు ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా రూ.10లక్షలు, మోపిదేవి వ్యక్తిగతంగా రూ.లక్ష అందించారన్నారు. అంతేకాకుడా మృతుడి తల్లికి ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగం, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి అనుమతులు కూడా మంజూరు చేయటం జరిగిందన్నారు, ప్రభుత్వ పరంగా ఇన్ని విధాలుగా ఆదుకుంటే ప్రతిపక్ష పార్టీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు వారికి గుర్తు వచ్చినప్పుడల్లా నెలకి రెండు నెలలకు ఒక్కసారి ఉప్పాలవారిపాలెం రావటం మీడియాతో ఇష్టానుసారంగా మాట్లాడి వారి రాజకీయ స్వలాభం కోసం ప్రభుత్వం పై విమర్శలు చేసి పైచాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. కుమారుడు చనిపోయి ఆ కుటుంబం ఇప్పుడిప్పుడే కోలుకుంటుంటే ప్రతి పక్షనాయకులు మాత్రం ఆ మరణాన్ని పదే పదే గుర్తు చేస్తూ ఆ కుటుంబాన్ని మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీలు కులాలు, పార్టీల పేరిట రెచ్చగొట్టి బాధిత కుటుంబాన్ని అడ్డం పెట్టుకుని స్వార్ధ రాజకీయాలకు బరితెగిస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ కుటుంబాన్ని న్యాయపరంగా అన్నివిధాల ప్రభుత్వం ఆదుకుంటామని నిందితుల ఫోన్ కాల్‌డేటా పూర్తిగా పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసు వారిని కోరారు, కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గౌడ నాయకులు తాతా వెంకటేశ్వర్లు, నాగుల నరసిహరావు, పొన్నూరు ఆషా, కాటూరి బసవయ్య, నాగరాజు, జన్ను వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ స్టేషన్‌ను పరిశీలించిన చీఫ్ సెక్యూరిటీ కమిషనర్

చీరాల అర్బన్: చీరాల రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్ స్టేషన్‌ను ఆదివారం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎండీ ఎస్ జెడ్ ఖాన్ పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన చీరాలలోని ఆర్పీఎఫ్ నూతన స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ స్టేషన్‌లోని రికార్డులు, అలానే సిబ్బందికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది మానసిక, శారీరక దారుఢ్యాన్ని పరిశీలించారు. అలాగే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట విజయవాడ డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.మధుసూదనరావు, చీరాల ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు ఉన్నారు.


స్టేషన్ పరిశీలించిన ఆర్పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్


క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురంలో రెండు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్


టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

మార్కాపురం: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం స్థానిక డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అండ్ యోగా క్లబ్ అసోసియేషన్ ద్వారా ఓల్డ్ ప్రకాశం, ఓల్డ్ గుంటూరు జిల్లాల స్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దసరా పండుగను పురస్కరించుకుని రెండు జిల్లాల స్థాయిలో పోటీలను ఏర్పాటు చేసిన భీమవరం వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. ఎమ్మెల్యే స్వయంగా బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రెండు జిల్లాల నుంచి మొత్తం 60 టీములు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి చెన్నైకి చెందిన అస్విక్ వికాస్ టీమ్, ద్వితీయ బహుమతి మునీర్, కిరణ్ టీమ్, తృతీయ బహుమతి రమేష్ టీమ్, నాలుగో బహుమతి మణి, కాశీ టీమ్‌లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు డి. వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా, సయ్యద్ దాదా పీరా, జీఎస్ మనోజ్ బహుమతులు అందించారు. విశిష్ట అతిథులు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది భూపని కాశయ్య, స్నేహ నాట్య అకాడమీ ప్రిన్సిపాల్ పువ్వాడ ప్రతిమను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీ


గవర్నర్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ జిందాల్, కలెక్టర్ రంజిత్‌బాషా

చీరాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ఆదివారం చీరాల రూరల్ మండలం వాడరేవులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌లు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందించారు.

జ్యోతివాసు పద్య రచన అమోఘం

రిటైర్డ్ ఆర్జేడీ దేవపాలన


జ్యోతి వాసు దంపతులను సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి: ఉన్నం జ్యోతి వాసు రచించిన నాకధునీ శిఖరాల కావ్యంలో పద్య రచన అమోఘమని రిటైర్డ్ ఆర్జేడీ యూ.దేవపాలన అన్నారు. సృజన సాహిత్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కాళికా సమేత కమతేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రిటైర్డ్ న్యాయమూర్తి సాహితీవేత్త గాడేపల్లి సీతారామమూర్తి స్మారక సభను నిర్వహించారు. ఈసభలో గాడేపల్లి సీతారామమూర్తి స్మారక పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త ఉన్నం జ్యోతివాసుకు సీతారామమూర్తి కుమారుడు గాడేపల్లి దివాకరదత్తు అందజేశారు. ఈ సభకు కె.అనీల కుమారసూరి అధ్యక్షత వహించారు. గాడేపల్లి మాట్లాడుతూ ఉన్నం జ్యోతివాసు వంటి మహాకవిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఇంత గొప్ప రచయిత లేడని చెప్పారు. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీతారామమూర్తి కవిత్వం చదివి మైమరచిపోతుంటామన్నారు. జాషువా పద్యంలో ఉండే శిల్ప సౌష్టవం ఉన్న వారి రచనల్లో కనిపిస్తుందన్నారు. అధ్యక్షుడు అనీల కుమార సూరి మాట్లాడుతూ సీతారామమూర్తి కవిత్వం ధారా శుద్ధితో శోభిస్తోందన్నారు. ఆయన స్మారక పురస్కారాన్ని జ్యోతి వాసుకు ఇవ్వడం సమంజసమన్నారు. సాహిత్య కార్యక్రమంలో జాగర్లమూడి ప్రతాప్, ఎండీ రఫీ, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

అలల తాకిడికి గురై హైదరాబాద్ యువతి మృతి


మృతి చెందిన సమియా

చీరాల టౌన్: అంతవరకు కుటుంబసభ్యులతో కలిసి సరదాగా అలలతో సంతోషంగా ఆడుకుంది. బహుశా ఆ సంతోషాన్ని తట్టుకోలేక అలలు యువతిని తనలోకి లాగేసుకొని ప్రాణాలు తీశాయి. కుటుంబ సభ్యులతో వాడరేవు సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన కుటుంబంలో విహారం విషాదాన్ని నింపింది. చీరాల రూరల్ ఈపురుపాలెం ఎస్‌ఐ పి.జనార్దన్ వివరాల మేరకు.. దసరా సెలవుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నాంపల్లికి చెందిన సమియా (24) కుటుంబ సభ్యులు నలుగురితో ఆదివారం ఉదయాన్నే వాడరేవుకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి తీరంలో సముద్రంలో స్నానం చేస్తుండగా సమియా ఒక్కసారిగా అలల తాకిడికి గురైంది. సమీపంలోని మత్స్యకారులు, తోటి పర్యాటకులు అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతున్న సమియాను రక్షించి హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్ర అపస్మారక స్థితిలోకి వెళ్లిన సమియా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. సరదాగా తీరంలో గడిపేందుకు వచ్చిన ఓ కుటుంబంలో సముద్రం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికి అందివచ్చిన తమ కుమార్తె అర్ధాంతరంగా తనువు చాలించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలలో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో మద్యం సేవించిన ప్రయాణికుడు

సోషల్ మీడియాలో వైరల్

చీరాల అర్బన్: చీరాల డిపోకు చెందిన హైర్ బస్సులో ఓ ప్రయాణికుడు మద్యం తాగడంతో ప్రయాణికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. చీరాల డిపోకు చెందిన హైర్ బస్సు శనివారం రాత్రి ఒంగోలు నుంచి చీరాలకు బయలుదేరింది. త్రోవగుంట వద్ద ఎక్కిన ప్రయాణికుడు డ్రైవర్ పక్కన ఇంజన్ బ్యానెట్‌పై కూర్చొని మద్యం తాగాడు. అయితే ప్రయాణికులు గమనించి వారించడంతో ప్రయాణికులతో కూడా వాగ్వివాదానికి దిగాడని సమాచారం. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయింది. ఈ విషయంపై చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల కుమారిని వివరణ అడుగగా త్రోవగుంటలో ఎక్కిన ప్రయాణికుడితో పాటు మరో ఇద్దరు ఎక్కారన్నారు. సీటు లేకపోవడంతో అతడు బ్యానెట్‌పై కూర్చొన్నాడన్నారు. అతడు తాగడంతో డ్రైవర్ వద్దని చెప్పినా వినలేదని, కొంత దూరం తర్వాత బస్సును నిలిపివేశాడన్నారు. అయితే ప్రయాణికులు సర్ది చెప్పడంతో మద్యం తాగిన వ్యక్తిని దింపివేశారన్నారు. ఈ విషయమై బస్సు డ్రైవర్, కండక్టర్ల వద్ద నుంచి వివరాలను నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. అలానే కండక్టర్, డ్రైవర్‌లను డ్యూటీల నుంచి తప్పించామని, బస్ సర్వీసును కూడా ఆపివేశామన్నారు. ఈఘటనపై పూర్తి వివరాలు రావాల్సి ఉందన్నారు.

'మోటార్ వర్కర్స్' అధ్యక్షుడిగా ట్రాక్టర్ కరిముల్లా



మాచర్ల: పల్నాడు జిల్లా మోటార్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ట్రాక్టర్ కరిముల్లా మేస్త్రి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం పట్టణంలో జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో మోటార్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా అధ్యక్షులైన ట్రాక్టర్ కరిముల్లాతో పాటు కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు సాంబ, సత్యనారాయణలు తెలిపారు. నూతన కార్యవర్గంలో భాగంగా ఉపాధ్యక్షులుగా జీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా షేక్ అల్లాభక్షు, సంయుక్త కార్యదర్శిగా పాశం అర్జున్‌రావు, కోశాధికారిగా షేక్ జానీబాషా, ఫరూక్, రాములును ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం 120 మంది సభ్యులు సమావేశమై ఆటోనగర్ అభివృద్ధి, వివిధ అంశాలపై చర్చించి అనంతరం కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి

అచ్చంపేట: విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని ఓర్వకల్లులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొట్టు ఆంజనేయులు పెద్దకుమారుడు కొట్టు యశ్వంత్(14) తన ఇంటిపైకి ఎక్కగా పైన బిగించిన టాప్ లైట్ టచ్ కావడంతో విద్యుత్‌షాకు గురై అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. తల్లిదండ్రులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికి వైద్యులు చూసి మృతిచెందినట్లుగా ధ్రువీకరించాడు. యశ్వంత్ అచ్చంపేటలోని విద్యాన్‌పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఆంజనేయులు, సునీత దంపతులకు మృతుడు పెద్దకుమారుడు. సర్పంచ్ కొలకలూరి పేరయ్య, మాజీ సర్పంచ్ పూల కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పూల వెంకటేశ్వర్లు తదితరులు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన బైక్.. బాలుడు మృతి

మరొక విద్యార్థికి గాయాలు


మృతి చెందిన హేమంత్ శివసాయి(ఫైల్)

మాచవరం: అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఆటోవెనుక భాగాన్ని ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతి చెందగా, మరొక విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సూరె హేమంత్ శివసాయి (15) పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. తన స్నేహితుడు ఫణీంద్రతో కలిసి మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మరొక విద్యార్థి వద్ద పుస్తకాలు తీసుకునేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ కొత్తగణేశునిపాడు, పిల్లుట్ల గ్రామాల మధ్య ఆటోవెనుక భాగాన్ని ఢీకొట్టారు. గాయాలపాలైన ఇద్దరిని పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఫణీంద్రకు తీవ్రగాయాలు కాగా, చికిత్స పొందుతూ హేమంత్ శివసాయి మృతి చెందాడు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

కొప్పునూరులో బయల్పడిన పురాతన చిత్రం

- సుమారు 6వేల ఏళ్లనాటిదిగా గుర్తింపు
- కాపాడుకోవాలంటున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి


కొప్పునూరు గ్రామంలో బయలుపడిన ఆరువేల సంవత్సరాల నాటి దుప్పి చిత్రం

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొప్పునూరు పొలిమేర గుండాలలో శిలాయుగపు చిత్రకళ వెలుగు చూసిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. పురాతన అవశేషాలు, వారసత్వ కట్టడాలను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించే ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొప్పునూరు గ్రామ శివారులోని గుండాల వీరుల వాగు వద్ద కాకతీయుల కాలపు శిథిల వెంకటేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తుండగా వాగులో కొత్త రాతియుగపు దుప్పి బొమ్మను అనుకోకుండా కనుగొనడం జరిగిందన్నారు. మాచర్ల చరిత్రకారుడు, పావులూరి సతీష్, రమేష్, కొప్పునూరుకు చెందిన దుర్గంపూడి యుగనాథ్‌రెడ్డి, బుద్ధవనం ప్రాజెక్టు అధికారి డి.ఆర్.శ్యాంసుందరరావు బృందంతో కలిసి వాగులో తిరిగి వస్తుండగా శిలాయుగపు రాతి ఆవాసపు గోడపై 2015 సెంటీమీటర్ల పొడవు, ఎత్తులతో ఉన్న దుప్పి చిత్రం కనిపించిందన్నారు. కొత్త రాతియుగపు ప్రజలు వారు నిత్యం వాడే రాతి పనిముట్లతో రాతిచరియ కప్పుపై వరుసగా కొట్టి, చక్కటి కొమ్ములున్న దుప్పిబొమ్మను తీర్చిదిద్దారని కొంచెం దూరంలో కొత్త రాతియుగపు రాతి పనిముట్లు తయారు చేసుకొన్న ఫ్యాక్టరీ స్థలం ఉందని ఆయన చెప్పారు. అదే వీరుల వాగులో ఉన్న మరో రాతి ఆవాసంపై తెల్ల జిగురు రంగుతో ముద్రించిన రెండు చేతిముద్రలు ఉన్నాయని, సమీప పొలాల్లో ఉన్న ఇనుప యుగపు సమాధుల వద్ద ఈ చేతి ముద్రలు క్రీ.పూ 1000 సంవత్సరాల నాటివని శివనాగిరెడ్డి చెప్పారు. వాగు బయట పొలాల్లో శాతవాహన కాలపు ఇటుకలు, మట్టి పాత్రల అవశేషాలను కూడా గుర్తించామన్నారు. తద్వారా కొప్పునూరు గ్రామానికి శిలాయుగం నుంచి శాతవాహన కాలం వరకు చరిత్ర ఉందని ఈ పురావస్తు ఆధారాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని కొప్పునూరు గ్రామస్తులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

గుర్తుకొస్తున్నాయి..!



సత్తెనపల్లిలో కలుసుకున్న 1974-75 బ్యాచ్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు

- 49 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- 2025లో స్వర్ణోత్సవాలు నిర్వహించాలని తీర్మానం

సత్తెనపల్లి: ఎక్కడో పుట్టి .. ఎక్కడో పెరిగి .. ఇక్కడే కలిశాము .. అన్నట్లుగా 49 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న సత్తెనపల్లిలో స్నేహితులంతా మళ్లీ కనిపించడంతో పండగ వాతావరణం నెలకొంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ చదువుకున్న విద్యార్థులు మూడు నెలలుగా సామాజిక మాధ్యమాల ద్వారా ఒకరినొకరు సంప్రదించుకొని చదువుకున్న పట్టణంలో కలుసు కున్నారు. ఎస్ఎస్‌సీ అనంతరం వారందరూ విడిపోయి చదువు పూర్తి చేసి వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు నాటి మిత్రులను చూసి ఆనందపడ్డారు.

ఉదయం నుంచే పండుగ వాతావరణం...

పూర్వ విద్యార్థుల ద్వితీయ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో గల మాడా విశ్వేశ్వరరావు కల్యాణమండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. 100 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పూర్వ విద్యార్థులు కె.శేషిరెడ్డి, షేక్.జిలాని, నరసరావుపేటలో అనాథ వృద్ధాశ్రమం నడుపుతున్న ఎస్.భానుమతిలకు పూర్వ విద్యార్థుల నిధి నుంచి రూ.40 వేలు ఆర్థికసాయం అందించేందుకు ప్రకటించారు. 2025లో పాఠశాల స్వర్ణోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘ సెక్రటరీ కొప్పురావూరి చిన్న కనకయ్య ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు.

ఏపీ ఎరుకల ప్రజాసంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

అధ్యక్ష, కార్యదర్శులుగా పోతురాజు, వీర్లయ్య


ఎంపికైన నూతన కార్యవర్గంతో రాష్ట్రకార్యవర్గ, నాయకులు

నరసరావుపేట: ఏపీ ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మేడ పోతురాజు, ప్రధాన కార్యదర్శిగా మొగిలి వీర్ల అంకయ్య ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన నూతన కమిటీ ఎంపిక కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిక శ్రీనివాసరావు, కట్టా రామాంజనేయులు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు పేరం సాంబశివరావు, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ పవన్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారని పోతురాజు వెల్లడించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుంభా చిన్నముత్తయ్య, కోశాధికారిగా మొగిలి వెంకట్రావు, గౌరవ అధ్యక్షుడిగా కుంభా అంజయ్య, గౌరవ సలహాదారునిగా తిమ్మసత్తి మూర్తి, మహిళా అధ్యక్షురాలుగా మేడ సామ్రాజ్యం, వైస్ ప్రెసిడెంట్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీలను ఎంపిక చేశారని పోతురాజు తెలిపారు.

ఉమ్మడి జిల్లా బాలికల ఖోఖో జట్టుకు నకరికల్లులో శిక్షణ


ఖోఖో జట్టుకు శిక్షణనిస్తున్న అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, పీడీ చింతా పుల్లయ్య

నకరికల్లు: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు క్రీడాకారిణిలకు శిక్షణనిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలికల జట్టుకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈనెల 19వ తేదీవరకు శిక్షణ కొనసాగుతుందని అన్నారు. ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ, ఖోఖో క్రీడలో మెలకువలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. జూనియర్స్ జట్టుకు ఈనెల 20,21,22వ తేదీల్లో చిత్తూరు జిల్లా యాదమరిలో సబ్ జూనియర్స్ జట్టుకు నవంబర్ 26,27,28వ తేదీల్లో నరసరావుపేటలోని శంకరభారతీపురం ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లా జట్టు విజయం సాధించడమే లక్ష్యంగా శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.